సాక్షి వికారాబాద్

గురువారం ■ 20 ■ ఫిబ్రవరి ■ 2025




పసిడి పతకాల ప్రణవి

బషీరాబాద్‌కు చెందిన తలారి ప్రణవి చిరుతలా పరుగెడుతోంది. అథ్లెటిక్స్ పోటీల్లో పసిడి పతకాలను ఒడిసి పడుతోంది. 8లో▸



కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

కేంద్ర బడ్జెట్ శ్రామిక వర్గానికి వ్యతిరేకంగా ఉందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య పేర్కొన్నారు. 8లో▸



ప్రత్యేక పాలన.. అస్తవ్యస్తం

గ్రామ పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. కార్యదర్శులు అధిక పనిభారంతో సతమతమవుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం వహించొద్దు

వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీఓ వాసుచంద్ర తదితరులు

కుల్కచర్ల: విద్యార్థులకు అందించే భోజనంలో నిర్లక్ష్యం వహించరాదని వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర సూచించారు. బుధవారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో కొన్నిరోజుల వరకు చికెన్‌ను పెట్టవద్దని సూచించారు. ముఖ్యంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సమయానుకూలంగా భోజనాన్ని అందించాలని పేర్కొన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కుల్కచర్ల డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

ఎస్పీ నారాయణరెడ్డి



కాగ్నా నదిని పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

యాలాల: కాగ్నానది నుంచి ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని కోకట్ గ్రామ శివారులోని కాగ్నానది పరివాహక ప్రాంతాన్ని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా కాగ్నా నదిలో అధికారులు గుర్తించిన ఇసుక రీచ్‌లను పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఇసుక రవాణాకు ఆటంకం లేకుండా చూడాలని పోలీసులను ఎస్పీ ఆదేశించారు. ప్రభుత్వ అనుమతులు పొంది ఇతర ప్రాంతాలకు తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

వికారాబాద్‌లో రాష్ట్రస్థాయి క్రీడలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని గౌలికార్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నుంచి ఈ నెల 23 వరకు రాష్ట్రస్థాయి కబడ్డీ సబ్ జూనియర్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరుశురాంనాయక్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఆనంద్ తెలిపారు. బుధవారం క్రీడా పోటీల నిర్వహణ ఏర్పాట్లను వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ పోటీల్లో 33 జిల్లాల నుంచి బాలురు, బాలికలు పాల్గొంటారన్నారు. పోటీలను అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రారంభిస్తారని చెప్పారు. పోటీలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వికారాబాద్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. వీటిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, సద్దాం, నరేందర్ నాయక్, నరసింహనాయక్, రఘు, కలిమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యూచర్' భద్రతకు ఠాణా ఏర్పాటు

యాచారం: ఫ్యూచర్ సిటీ భద్రతను దృష్టిలో పెట్టుకుని కొత్తగా పోలీస్‌స్టేషన్ నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి తెలిపారు. ఇందుకు మర్లకుంటతండా సమీపంలోని 330 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పక్కనే టీజీఐఐసీకి చెందిన మూడు ఎకరాల స్థలంలో 'హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ' పేరుతో ఠాణా ఏర్పాటు చేయనుందని పేర్కొన్నారు. బుధవారం ఆమె.. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏ మార్గం గుండా వెళ్తోందనే విషయాలను తెలుసుకున్నారు.

పోదాం పోలేపల్లి

- నేటి నుంచి రేణుకాఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు
- సర్వం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం
- రేపు సీఎం రేవంత్‌రెడ్డి రాక



ముస్తాబైన పోలేపల్లి ఎల్లమ్మ దేవస్థానం

బొంరాస్‌పేట: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పోలేపల్లి రేణుకా ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు వైభవంగా జరగనున్న జాతరకు ఆలయం ముస్తాబైంది. అమ్మవారి గుడితోపాటు పరశురాముడి గుడి, కోనేరు, ప్రాంగణమంతా రంగులతో కనువిందు చేస్తున్నాయి. జాతరలో ప్రధాన ఘట్టమైన సిడెను వీక్షించేందుకు రాష్ట్రంతో పాటు, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకోనున్నారు. అందుకు తగినట్లు అధికార యంత్రాంగం ఏర్పాట్లను సిద్ధం చేసింది. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఈసారి ప్రత్యేకం

ఏటా కనుల పండువగా జరిగే పోలేపల్లి ఎల్లమ్మ ఉత్సవాల్లో ఆలయ కమిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. రూ.10 లక్షలతో సిడెను, రూ.14 లక్షలతో కొత్త తేరును(రథం) సిద్ధం చేశారు. గురువారం రాత్రి గ్రామవీధుల్లో పల్లకీ సేవ, శుక్రవారం సాయంత్రం జల్దిబోనం, సిడె కార్యక్రమం నిర్వహిస్తారు. రథానికి ఒక పొడవాటి దుంగను కడతారు. దాని చివరన ఒక తొట్టెను ఏర్పాటు చేసి, అందులో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారు. ఈ సమయంలో పసుపు బండారు భక్తులపైకి విసురుతూ అమ్మవారికి జేజేలు పలుకుతారు. శనివారం సాయంత్రం తేరు, రథోత్సవం, ఆదివారం ప్రత్యేక పూజలు, 24న గ్రామంలో పల్లకీ ఊరేగింపు ఉంటుంది.

హాజరుకానున్న ప్రముఖులు



జాతర ప్రాంగణం

పోలేపల్లి గ్రామంలో స్వయంభుగా వెలసిన ఎల్లమ్మ మాత జాతరలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి 21న రానున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన సిడెను తిలకించనున్నారు. సీఎం మధ్యాహ్నం తర్వాత దేవస్థానానికి వచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జయరాములు తెలిపారు. ఇందుకోసం అధికారులు హెలిప్యాడ్ సిద్ధం చేశారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీ డీకే అరుణ, ఎనుముల తిరుపతిరెడ్డి, జిల్లా కలెక్టర్‌తోపాటు ప్రముఖులు దర్శించుకోనున్నారు. భక్తులకు ఆరోగ్యం, భద్రత కోసం వైద్య సిబ్బందితో శిబిరాలు, పోలీసు బందోబస్తుతో ప్రత్యేక నిఘాను ఉంచారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.



అమ్మవారి సిడె



ఏర్పాట్లు సిద్ధం

రాష్ట్రంలో అతిపెద్ద జాతరైన మేడారం మాదిరిగానే ఇక్కడ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. సీఎం ప్రత్యేక శ్రద్ధతో ఈసారి జాతరను వైభవంగా నిర్వహిస్తాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాం. మొబైల్ మరుగుదొడ్లు, మూత్రశాలలు, స్నానాల గదులు, తాగునీరు వంటివి ఏర్పాటు చేశాం. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దానికి తగ్గట్లు అధికారులతో సమన్వయం చేసుకుంటాం.

– జయరాములు, ఆలయ కమిటీ చైర్మన్, పోలేపల్లి దేవస్థానం

హెలిపాడ్ పరిశీలించిన ఎస్పీ

పోలేపల్లి ఎల్లమ్మ జాతరలో పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం ఆయన జాతర ప్రాంగణం, ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తజనానికి సహకరించాలన్నారు. జాతరలో దొంగతనాలు, గొడవలు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అప్రమత్తతతో మెలగాలని పోలీసు సిబ్బందికి సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి రాక నైపథ్యంలో హెలిపాడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ జయరాములు, కమిటీ సభ్యులు, మేనేజర్ రాజేందర్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

పోలీసుల్లో అతడే బాస్!

- **ఎస్‌హెచ్‌ఓలుగా అవకాశం దక్కని మహిళా ఎస్‌ఐలు**
- జిల్లాలో ఆరుగురు ఉన్నా అన్ని చోట్లా అదనపు ఎస్‌ఐలుగానే
- సకల బాధ్యతలు నిర్వహిస్తున్నా చిన్నచూపు తగదంటూ ఆవేదన

వికారాబాద్: ఆధునిక భారత నిర్మాణానికి మహిళా శక్తి కొండంత అండ. వారు అనేక రంగాల్లో తమ ప్రతిభ చూపుతూ దేశాభివృద్ధిలో కీలకంగా మారారు. ఇంత చేస్తున్నా కొన్ని రంగాల్లో జెండర్ పరమైన చిన్నచూపును ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని పోలీసు శాఖలో మహిళా ఎస్‌ఐల విషయంలో వివక్ష కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. వీరికి ఎస్‌హెచ్‌ఓలుగా బాధ్యతలు అప్పగించడానికి ఉన్నతాధికారులు ఆసక్తి చూపటం లేదు. విధి నిర్వహణలో అన్ని రకాల బాధ్యతలు అప్పగిస్తున్నా ఎస్‌హెచ్‌ఓ(స్టేషన్ హౌస్ ఆఫీసర్)లుగా మాత్రం చాన్స్ ఇవ్వడం లేదు. జిల్లాలో ప్రస్తుతం ఆరుగురు మహిళా ఎస్‌ఐలు ఆయా ఠాణాలు, హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఒక్కరిని కూడా ఎస్‌హెచ్‌ఓగా నియమించకపోవడం పోలీసు శాఖలో కొనసాగుతున్న వివక్షకు రుజువుగా నిలుస్తోంది. ఈ ఆరుగురు లా అండ్ ఆర్డర్‌లో అన్ని రకాల విధులు నిర్వహిస్తున్నారు. కేసుల విచారణ మొదలుకుని బందోబస్తులు, నైట్ డ్యూటీలు, పరేడ్ తదితర అన్ని రకాల విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారిని ఎస్‌హెచ్‌ఓలుగా మాత్రం తీసుకోవడం లేదు.

పైరవీల సంస్కృతితో అడ్డు

జిల్లాలో మొత్తం 22 పోలీస్ స్టేషన్లు ఉండగా ఇందులో మూడు చోట్ల(వికారాబాద్, వికారాబాద్ మహిళా, తాండూరు) ఇన్‌స్పెక్టర్ ర్యాంకు అధికారులు ఎస్‌హెచ్‌ఓలుగా కొనసాగుతున్నారు. మిగిలిన 19 పోలీస్ స్టేషన్లలో సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్‌ఐ) ర్యాంకు అధికారులు ఈ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇందులో ఒక్కరు కూడా మహిళలు లేకపోవడం గమనార్హం. అన్ని ఠాణాల్లో పురుషాధిక్యమే రాజ్యమేలుతోంది. ప్రతి పోస్టింగ్ అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సిఫార్సులతో జరుగుతుందనేది బహిరంగ రహస్యమే. అయితే డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహించే పురుషుల పైరవీల నేపథ్యంలో మహిళా పోలీసులు వెనుకబడుతున్నారు. దశాబ్దాల తరబడి ఉద్యోగకాలం మొత్తం ఎస్‌హెచ్‌ఓలుగా విధులు నిర్వహించకుండానే అదనపు ఎస్‌ఐలుగా, లూప్‌లైన్ డ్యూటీల్లో విధులు నిర్వహించాల్సి వస్తోందని మహిళా ఎస్‌ఐలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రెండు దశాబ్దాల్లో నలుగురే

కొత్త జిల్లా ఏర్పాటు కాక ముందు నుంచే పశ్చిమ రంగారెడ్డి జిల్లా పరిధిలోని 20 ఠాణాలతో వికారాబాద్‌లో ఎస్పీ కార్యాలయం కొనసాగుతోంది. అయితే గడిచిన రెండు దశాబ్దాల్లో జిల్లాలో నలుగురికి మాత్రమే ఎస్‌హెచ్‌ఓలుగా బాధ్యతలు అప్పగించారు. ఇందులో లక్ష్మీమాధవి నవాబుపేట, వికారాబాద్ ఎస్‌హెచ్‌ఓగా పురుషులకు దీటుగా బాధ్యతలు నిర్వర్తించి శభాష్ అనిపించుకున్నారు. అనంతరం హర్షభార్గవి ధారూరు ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు నిర్వహించారు. వీరిద్దరు మాత్రమే జనరల్ పోలీస్ స్టేషన్లలో ఎస్‌హెచ్‌ఓలుగా బాధ్యతలు నిర్వహించగా, మరో ఇద్దరు ప్రమీలా, రేణుకారెడ్డి మహిళా పోలీస్ స్టేషన్ బాధ్యతలు చేపట్టారు. మొత్తంగా గడిచిన ఇరవై ఏళ్లలో నలుగురు మాత్రమే స్టేషన్ బాధ్యతలు చక్కబెట్టారు. ప్రస్తుత ఎస్పీ నారాయణరెడ్డి తమకు ఎస్‌హెచ్‌ఓలుగా అవకాశం కల్పిస్తారని మహిళా ఎస్‌ఐలు ఆకాంక్షిస్తున్నారు.

మహిళల అభ్యున్నతికి పెద్దపీట



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తుందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్‌లోని ధర్మ విద్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న నియోజకవర్గానికి చెందిన 105 మంది మహిళలను ఆయన అభినందించారు. వారికి కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. అందుకు జీవనోపాధి అవకాశాలు పెంపొందించుకోవాలన్నారు. ప్రస్తుతం టైలరింగ్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తుందన్నారు. మహిళ సంఘాల బలోపేతానికి ప్రభుత్వం తగిన చొరవ తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఎస్సీల అభివృద్ధి కోసం రూ.21,874 కోట్లు కేటాయించిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు నిధులు తీసుకు వస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, నాయకులు రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్, మురళీ, రాజ్‌కుమార్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా వికారాబాద్‌లో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

నేల 'పాలు'!

మదర్ డెయిరీ సంస్థ నిర్వాకం వలన పాడి రైతులు గోస పడుతున్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో.. డబ్బుల కోసం అధికారులను ప్రాధేయ పడుతున్నారు. అయినా స్పందన లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలను నేలపై పారబోసి నిరసన వ్యక్తంచేశారు.

- రెండు నెలలుగా పాడి రైతులకు అందని బిల్లులు
- పారబోసి నిరసన వ్యక్తం చేసిన వైనం
- స్పందించని డెయిరీ యాజమాన్యం



పాలు పారబోసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

యాచారం: మండల పరిధి కుర్మిద్ద గ్రామంలో 90 మంది రైతులు 25 ఏళ్లుగా మదర్ డెయిరీకి పాలు పోస్తున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం రెండు పూటలా 1,700 లీటర్ల పాలను సంస్థకు విక్రయిస్తున్నారు. నాణ్యతను బట్టి గేదె పాలు లీటరు రూ.46, ఆవు పాలు లీటరుకు రూ.31 వరకు సంస్థ చెల్లిస్తుంది. ఇదిలా ఉండగా.. ఆరు నెలలుగా రైతులకు డెయిరీ యాజమాన్యం సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు.

రూ.45 లక్షలకు పైగా..

గతేడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెల బిల్లులు రూ.45 లక్షలకు పైగానే అందాల్సిన ఉంది. వారం క్రితం బిల్లుల పెండింగ్‌పై రైతులు గ్రామంలోని మదర్ డెయిరీ సంస్థ కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. చైర్మన్ మహేందర్‌రెడ్డిని నిలదీశారు. ఇదే విషయాన్ని చైర్మన్ సంస్థ ఉన్నతాధికారులకు తెలిపారు. బిల్లులు అందజేయాలని కోరారు. అయినప్పటికీ.. సంస్థ నుంచి స్పందన లేకపోవడంతో బుధవారం డెయిరీ ఎదుట పాలు పారబోసి నిరసన వ్యక్తంచేశారు. పశువులను సాకడం కోసం రూ.వేలు ఖర్చు చేసి దాణా, పశుగ్రాసం కొనుగోలు చేసి, నెల మొత్తం కష్టపడితే బిల్లులు చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పశు పోషణతో పాటు కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని వాపోయారు. రెండు, మూడు రోజుల్లో బిల్లులు మొత్తం చెల్లించాలని, లేని పక్షంలో నల్గొండ జిల్లాలో ఉన్న మదర్ డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత : ఎంపీ అరుణ

కొందుర్గు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దైవ మార్గంలో నడుచుకోవాలని సూచించారు. యువత దురలవాట్లకు చేరువ కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి, మనోహర్ రెడ్డి, శివారెడ్డి, మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఏడేళ్ల బాలుడి మృతి

- డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు
- బషీరాబాద్ టాకీతండాలో విషాదం



శ్రీరామ్ (ఫైల్)

బషీరాబాద్: ఆర్టీసీ బస్సు ఢీకొని ఏడేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టాకీతండాలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శంకర్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రాథోడ్ వెంకటేశ్ కుమారుడు రాథోడ్ శ్రీరామ్(7) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం ఇంటిపక్కనే రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా తాండూరు నుంచి క్యాద్గీరా వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో బాలుడిని ఢీకొట్టాడు. దీంతో కిందపడిపోయిన శ్రీరామ్ ఛాతి, తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు 108లో హుటాహుటినా తాండూరు ఎంసీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని సూచించగా.. కాసేపటికే బాలుడు మృతిచెందాడు. అల్లారుముద్దుగా చూసుకుంటున్న కొడుకు అకాల మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆడుతు పాడుతూ కనిపించే శ్రీరామ్‌ను విగత జీవిగా చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరోవైపు ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సును పోలీసులు బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు.

పసిడి పతకాల ప్రణవి

తలారి ప్రణవి చిరుతలా పరుగెడుతోంది. బరిలో దిగితే చాలు ఎంతమంది ప్రత్యర్థులున్నా పసిడి పతకాన్ని ఒడిసి పడుతోంది. ఇటీవల కేవలం 12 సెకన్లలోనే 100 మీటర్ల లక్ష్యాన్ని చేరుకుని రాష్ట్రస్థాయి రికార్డు నెలకొల్పింది. మూడేళ్ల కాలంలో జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని సుమారు యాభైకి పైగా స్వర్ణ, కాంస్య పతకాలు సాధించింది. తాజాగా హైదారాబాద్‌లో 11వ రాష్ట్ర యూత్ అథ్లెట్ చాంపియన్‌షిప్ పోటీల్లో ట్రై అథ్లీన్ విభాగంలో పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది.

- చిరుతలా పరుగెడుతున్న గురుకుల విద్యార్థిని
- 12సెకన్లలో 100 మీటర్ల లక్ష్యం చేరుకుని రికార్డ్
- నాలుగేళ్లలో 50కి పైగా బంగారు, కాంస్య పకతాలు
- రాష్ట్ర స్థాయి అండర్‌– 14 ట్రై అథ్లీన్ విభాగంలో మరో గోల్డ్
- అంతర్జాతీయ అథ్లెట్ కావడమే లక్ష్యమంటున్న మంతట్టి బాలిక


పతకాలతో తలారి ప్రణవి



పోటీలో ఎప్పుడు నంబర్ 1


కోచ్ నాగరాజుతో

బషీరాబాద్: మండల పరిధిలోని మంతట్టి గ్రామానికి చెందిన తలారి సురేష్, శ్రీదేవి దంపతుల రెండో కూతురు ప్రణవి హైదరాబాద్ గచ్చిబౌలి ఎస్సీ గురుకులంలో పదో తరగతి చదువుతోంది. అథ్లెట్ విభాగంలో ఈబాలిక ప్రతిభను గుర్తించిన ప్రిన్సిపాల్ ఆమెను గచ్చిబౌలి స్పోర్ట్స్ అకాడమీలో చేర్పించారు. ఇండియా అథ్లెటిక్ చీఫ్ హెడ్ కోచ్ నాగ్‌పూరి రమేశ్ వద్ద నాలుగేళ్లుగా శిక్షణ ఇప్పిస్తున్నారు. చదువుతో పాటు రోజు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మరో ఇద్దరు సహాయక కోచ్‌లు నాగరాజ్, షాజి అథ్లెటిక్స్‌లో ఆమెకు మెలకువలు నేరిస్తూ రాటుతేల్చారు.

రన్నింగ్, జంపింగ్ విభాగాల్లో..

వివిధ జిల్లాల్లో జరిగిన అనేక అండర్‌– 14 జోనల్ పోటీల్లో పాల్గొన్న ప్రణవి చిరుతలా పరుగెడుతూ కేవలం 12 సెకండ్లలో 100 మీటర్ల లక్ష్యాన్ని చేరుకుంంది. ఈ క్రమంలో సీఎం కప్, స్వేరో ఒలింపిక్స్, గురుకులాల అథ్లెటిక్, రాష్ట్ర స్థాయి అథ్లెట్ పోటీల్లో రన్నింగ్, జంపింగ్ విభాగాల్లో బోలెడు బంగారు పతకాలు సాధించింది. రన్నింగ్, జంపింగ్‌లో బోలెడు పసిడి పతకాలు సాధించింది. పాఠశాలలో ఉపాధ్యాయులు, కోచ్‌లు అందరూ ప్రేమగా ప్రణవిని పరుగుల రాణిగా సంబోధిస్తూ జాతీయ అథ్లెటిక్ పోటీలకు సిద్ధం చేస్తున్నారు. ఈనెల 17 నుంచి ఉస్మానియా యునివర్సిటీలో జరుగుతున్న 11వ రాష్ట్ర యూత్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ అండర్‌– 14లో ట్రై అథ్లీన్ విభాగంలో మరో గోల్డ్ మెడల్ సాధించి సత్తాచాటింది.

ఇంటి నిండా పతకాలే..

ప్రణవికి చిన్ననాటి నుంచి ఆటలు ఎంతో మక్కువ. 5వ తరగతి నుంచే అథ్లెట్ గేమ్స్‌లో పతకాల వేట ప్రారంభించింది. ముఖ్యంగా రన్నింగ్, జంపింగ్‌లో తనకుతానే సాటి అన్నట్లు ప్రతిభ కనబరుస్తోంది. ఇప్పటి వరకు వివిధ స్థాయిల్లో నిర్వహించిన అథ్లెట్ గేమ్స్‌లో 50కి పైగా బంగారు , కాంస్య పతకాలు, చాంపియన్ ట్రోఫీలు సొంతం చేసుకుంది. ఆమెకు వచ్చిన పతకాలు, ప్రశంస పత్రాలతో ఓ గది నిండిపోయిందంటే అతిశయోక్తి కాదు.

అంతర్జాతీయ అథ్లెట్ కావడమే లక్ష్యం

తల్లిదండ్రుల ప్రోత్సాహం.. కోచ్‌ల మార్గదర్శంలో రాష్ట్ర స్థాయిలో ఆడుతున్నా. నా ప్రతిభను చూసి గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణి నాపై ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. కోచ్‌లు నాగ్‌పూరి రమేష్, నాగరాజు, షాజి, ప్రిన్సిపాల్ సుజాత ప్రతీరోజు దిశానిర్దేశం చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్‌లో చాపియన్‌గా నిలువాలన్నదే నా లక్ష్యం. ఆ దిశగా సాధన చేస్తున్నా. పదో పరీక్షలకు సిద్ధమవుతున్నా. మా నాన్నే నాకు ఆదర్శం.

– ప్రణవి, క్రీడాకారిణి

భారతి సిమెంట్‌కు తిరుగులేదు

సంస్థ టెక్నికల్ మేనేజర్ సునీల్


తాపీమేస్త్రీలకు బీమా బాండ్లను అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

పరిగి: నాణ్యతకు మారో రూపమే భారతి సిమెంట్ అని సంస్థ టెక్నికల్ మేనేజర్ సునీల్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని శ్రీ రాజేశ్వరి ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీమేస్త్రీల సమావేశం నిర్వహించి 25 మందికి రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ చాలా నాణ్యమైందన్నారు. దీంతో నిర్మించిన నిర్మాణాల నాణ్యత ప్రామాణాలు ఉన్నతమైనవన్నారు. ఈ సిమెంట్‌ను ఎక్కువ శాతం నిర్మాణ రంగాల్లో స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అన్నారు. భారతి అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు సంస్థ నుంచి ఉచిత సాంకేతికసాయం అందిస్తామన్నారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో ఇంజనీర్లను సైట్ వద్దకు వచ్చి నిర్మాణంలో సహాయపడుతారన్నారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ బృందం మార్కెటింగ్ మేనేజర్ సతీష్‌రాజు, అసిస్టెంట్ మేనేజర్ వీరాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నీళ్లపల్లిలో వెలుగులోకి ఘటన


సాగర్ (ఫైల్)

బషీరాబాద్: ఇంట్లో దూలానికి ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని నీళ్లపల్లి గ్రామంలో బుధవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన హరిజన్ సాగర్(25) తాపీమేస్త్రీగా పనిచేస్తూ తల్లితో కలిసి ఉంటున్నాడు. అయితే ఈ నెల 17న అతడి తల్లి నర్సమ్మ బంధువులకి ఆరోగ్యం బాగలేదని పరామర్శకు తాండూరు ఆస్పత్రికి వెళ్లింది. మంగళవారం ఇంట్లో సాగర్ ఒక్కడే ఉన్నాడు. బుధవారం ఉదయం తలుపులు తెరవడక పోవడంతో చుట్టుపక్కల వాళ్లు కిటికీ నుంచి చూడగా ఉరి వేసుకొని కనిపించాడు. విషయం తెలుసుకున్న నర్సమ్మ ఇంటికి చేరుకొని బోరున విలపించింది. ఇంకా పెళ్లికూడా కాని చెట్టంతా కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లడిల్లింది. తన కొడుకు తరచూ కడుపు నొప్పితో బాధపడేవాడని, తట్టుకోలేకనే ఆత్మహత్య చేసుకుంటాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు జిల్లా ఆస్పత్రిలో శవపరీక్ష చేయించి బంధువులకు అప్పగించారు.

నాటుసారాపై ఉక్కుపాదం

- 120 లీటర్ల పట్టివేత
- గిరిజన తండాల్లో ఆబ్కారీ అధికారుల సోదాలు


పాలబావి తండాలో ఆబ్కారీ అధికారులు

బొంరాస్‌పేట: ఆబ్కారీ అధికారులు ఎట్టకేలకు తండాలపై దాడులు నిర్వహించారు. బుధవారం 120 లీటర్ల నాటుసారా పట్టివేశారు. కొడంగల్ ఆబ్కారీ సీఐ వెంకటేశ్వం మండల పరిధిలోని పాలబావితండా, మేడిచెట్టుతండా, బోడబండతండా, బాపల్లి తండాల్లో పోలీసులతో విస్తృతంగా సోదాలు చేశారు. నాటుసారా తయారీదారులైన నలుగురిపై కేసులు నమోదు చేశారు. అలాగే కల్తీకల్లు, గంజాయిలాంటి మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి వ్యవహారంపై 8712658751ను ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని ఆబ్కారీ సీఐ సూచించారు. ఈ దాడుల్లో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాల్‌రాజ్, డీటీఎఫ్ సీఐ శ్రీనివాస్, పరిగి, డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సైలు, 20మంది సిబ్బంది ఉన్నారు.

లారీ, ట్రాక్టర్ ఢీ

- ఐదుగురికి గాయాలు
- లారీ ఓవర్‌టేక్ చేయబోతుండగా ఘటన
- మరో ప్రమాదంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ


బోల్తాపడిన ట్రాక్టర్

చేవెళ్ల: హైదరాబాద్‌– బీజాపూర్ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయిన లారీ.. అదుపు తప్పి అదే ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధి ముడిమ్యాల సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి చేవెళ్ల వైపు వస్తున్న లారీ.. ఓవర్‌టేక్ చేయబోయి ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ఎగిరి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రోడ్డు పనులు చేసేందుకు కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్‌లో.. డ్రైవర్ వెంకన్న, కూలీలు వెంకటేశ్, శ్రీను, నవీన్‌లతో పాటు, లారీ డ్రైవర్ భాను ప్రసాద్‌కు స్వల్పగాయలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను బయటకు తీసి పోలీసులకు, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గాయపడిన వారిని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి, పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పి..

మండల పరిధి పామెన బస్‌స్టేజీ సమీపంలో ఓ లారీ అతివేగంగా వస్తూ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం నుంచి చేవెళ్ల మీదుగా షాద్‌నగర్ వైపు మైనింగ్ లోడ్‌తో లారీ వెళ్తోంది. చేవెళ్ల దాటిన తరువాత ముంబయి లింక్ హైవేపై లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న 33/11కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పోల్ విరిగిపోయింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. లారీ డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే విద్యుత్ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

కేశంపేట: మతిస్థిమితం లేని వృద్ధురాలు చెరువులో పడి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంజాయి జంగమ్మ(65) గ్రామంలో పాచి పనులు చేసుకుంటూ జీవించేది. గ్రామంలో జరుగుతున్న జాతరకు వెళ్లింది. ఈ క్రమంలో గ్రామ శివారులోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ఉన్న చెరువులో పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు.. విషయం ఆమె కుటుంబ సభ్యులకు తెలిపారు. చెరువులో నుంచి మృతదేహాన్ని బయటికు తీశారు. మృతురాలి కుమారుడు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

క్లుప్తంగా

క్రీడల్లో గెలుపోటములు సహజం


బహుమతులు అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: క్రీడల్లో గెలుపోటములు సహజమని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ధన్నారంలోని డీఏఆర్ గ్రౌండ్‌లో స్వర్గీయ గడ్డం శైలజ స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ తన సతీమణి శైలజపై అభిమానంతో క్రికెట్ పోటీలను ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరక్టర్ కిషన్ నాయక్, రాంచంద్రారెడ్డి, సతీష్‌రెడ్డి, మల్లేశం, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీ.. ఒకరి మృతి


ఘటనా స్థలంలో ఇమ్రాన్

మొయినాబాద్: కారు ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మలక్‌పేట్‌కు చెందిన ఇమ్రాన్(40) బండ్లగూడలో టెంట్‌హౌస్ నిర్వహిస్తున్నాడు. బుధవారం మొయినాబాద్‌కు వెళ్లిన ఇమ్రాన్.. తిరిగి వెళ్తూ భోజనం చేయడం కోసం జేబీఐటీ కళాశాల ఎదుట రోడ్డు పక్కన చిన్న హోటల్ సమీపంలో తన కారును ఆపి, నడుచుకుంటూ హోటల్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదే సమయంలో తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అతివేగంతో వచ్చి ఇమ్రాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అయినప్పటికీ.. ఢీకొట్టిన కారు అలాగే ముందుకు దూసుకుపోయి మరో బులెరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్నవారికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇమ్రాన్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియాకు, స్వల్పగాయాలైనవారిని స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇమ్రాన్ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ రైతు మృతి


వెంకట్‌రెడ్డి (ఫైల్)

చేవెళ్ల: పొలం పనులు ముగించుకొని ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న రైతును గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో అతను మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన ప్రకారం.. చేవెళ్ల మండల పరిధి అల్లవాడ గ్రామానికి చెందిన యాలాల పెద్ద వెంకట్‌రెడ్డి(65) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఎప్పటి మాదిరిగానే పొలానికి వెళ్లిన అతను.. రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా గ్రామ బస్‌స్టేజికీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రైతును గుర్తించిన స్థానికులు.. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం పట్నం మహేందర్‌రెడ్డి హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం బుధవారం కుటుంబీకులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య


కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ శ్రామిక వర్గానికి వ్యతిరేకంగా ఉందని, దీన్ని సవరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించాలని అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరించి బడ్జెట్‌ను రూపొందించిందన్నారు. పేద ప్రజలకు ఉపయోగం లేకుండా బడ్జెట్‌ను రూపొందించారని ఆయన విమర్శించారు. పెట్టుబడిదారులపై విధించే పన్నును 22శాతం నుంచి 15శాతానికి తగ్గించారన్నారు. పేద మధ్యతరగతుల ప్రజలు ఉపయోగించే వస్తువులపై 200శాతం పన్నులు పెంచుతూ దేశ ప్రజలకు అన్యాయం చేస్తున్నారన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ధనికులపై వారసత్వ పన్ను విధిస్తున్నారన్నారు. కానీ మనదేశంలో ఎందుకు విధించడం లేదని ప్రశ్నించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించేంత వరకు పోరాటం చేస్తునే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, సత్తయ్య, మహిపాల్‌రెడ్డి, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని బిహార్‌వాసి ఆత్మహత్య

పూడూరు: అనుమానాస్పదంగా ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని మృతి చెందిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ నుంచి కంకల్ వెళ్లే దారిలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా బిహార్ రాష్ట్రానికి చెందిన చోటు మంజు అని గుర్తించారు. వివరాలు తెలిస్తే చన్గోముల్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

లేబర్ కమిషనర్ వద్దకు 'సీసీఐ' పంచాయితీ

కార్మికులకు చెల్లించాల్సిన గ్రాడ్యూవిటీపై చర్చ

తాండూరు రూరల్: కరన్‌కోట్ గ్రామ శివారులోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఫ్యాక్టరీ వ్యవహారం డిప్యూటీ లేబర్ కమిషనర్ వద్దకు చేరింది. కంపెనీలో రైల్వే కాంట్రాక్టు కార్మికులుగా పని చేసి కొంత మంది కార్మికులు ఉద్యోగ విరమణ చేశారు. సీసీఐ యాజమాన్యం నుంచి రావాల్సిన గ్రాడ్యూవిటి చెల్లించాలని కార్మిక సంఘం నేత శరణప్పతో పాటు పలువురు హైదరాబాద్‌లో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రాఘవేంద్ర నాయక్‌ను వేడుకున్నారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు గ్రాడ్యూవిటి చెల్లించే విధంగా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ విషయమై మార్చి 26వ తేదీన మరోసారి యాజమాన్యం, కార్మికులతో చర్చలు నిర్వహిస్తానని లేబర్ కమిషనర్ తెలిపారన్నారు. కరన్‌కోట్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ శరణు బసప్ప తన బృందంతో డిప్యూటీ లేబర్ కమిషనర్ వద్దకు వెళ్లి సీసీఐ యాజమాన్యం గ్రాడ్యూవిటి చెల్లించే క్రమంలో కార్మిక సంఘం నేత శరణప్ప కార్మికులను తప్పుదోవపట్టిస్తున్నారని ఆరోపించారు. ఏది ఏమైనప్పటికీ కార్మికులకు మాత్రం న్యాయం జరగాలని వారు కోరుతున్నారు.

కుక్కల దాడిలో నెమలికి గాయాలు

ఇబ్రహీంపట్నం: వీధికుక్కల దాడిలో నెమలి గాయపడింది. ఈ సంఘటన బుధవారం ఉదయం ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక చెరువు కట్టపై నాలుగైదు కుక్కలు జాతియ పక్షి నెమలిని వెంటాడుతున్నాయి. వాకింగ్‌కు వచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌గౌడ్, మరో ఇద్దరు యువకులు కుక్కల బారి నుంచి నెమలిని కాపాడారు. గాయపడిన నెమలిని చెరదీసి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు వచ్చిన ఆ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డికి నెమలిని అప్పగించారు. అనంతరం స్థానిక పశువైద్యశాలలో మయూరానికి చికిత్స చేయించారు. ప్రాణాపాయస్థితి నుంచి కొలుకున్న పక్షిని సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు, యువకులను అటవీశాఖ అధికారులు అభినందించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్

అనంతగిరి: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో జిల్లా మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో పది సంవత్సరాల వేడుకల్లో భాగంగా వికారాబాద్ నియోజకర్గంలోని కేజీబీవీ పాఠశాలల విద్యార్థినులకు కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఆడ, మగ తారతమ్యం లేకుండా అన్ని అవకాశాలు కల్పించాలన్నారు. అమ్మాయిలు సాధించలేనిది ఏది లేదన్నారు. విద్యతోనే అన్ని సాధ్యమన్నారు. ఈ పోటీల్లో ధారూర్ కేజీబీవీ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రైతు భరోసా గందరగోళం



రైతు ఖాతాలో ఎకరా 15 గంటలకు రూ.750 జమ అయిన రసీదు

- అందరికి వేసినట్లు ప్రచారం
- ఎకరాల్లో భూములు...గుంటల్లో డబ్బుల జమ
- ఆందోళన చెందుతున్న రైతులు

ధారూరు: ఎకరా, రెండు, మూడు ఎకరాల వరకు రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని ప్రభుత్వం ప్రకటిస్తే క్షేత్రస్థాయిలో గందరగోళం నెలకొంది. రైతుల భూ విస్తీర్ణం ఎకరాల్లో ఉంటే డబ్బులు మాత్రం గుంటల్లో జమ అవతున్నాయని రైతుల్లో అయోమయం నెలకొంది. కొందరు రైతులకు అసలే డబ్బులు పడలేదు. ఇదేంటని వ్యవసాయశాఖ అధికారులను ప్రశ్నిస్తే తాము వాస్తవ జాబిత పంపించాం, ఎక్కడో పొరపాటు జరిగి ఉంటుందని పేర్కొనడం గమనార్హం. ప్రభుత్వం పంట పెట్టుబడి సాయం కింద జమ చేసిన డబ్బులు అందరికీ కాకుండా కొందరికి అన్నట్లుగా పడుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ధారూరు మండలంలోని నాగసమందర్, ధారూరు, కేరెళ్లి, మున్నూరుసోమారం, నాగారం, మోమిన్‌కలాన్, తరిగోపుల గ్రామాలతో పాటు చాలా గ్రామాల్లో రైతు భరోసా డబ్బులు జమకావడం లేదు. కొందరికి అసలే పడలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కొందరి ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జీరో చూపించడం అందరిని విస్మయానికి గురిచేసింది. మండల పరిధిలోని చౌట బాలప్పకు ఎకరా 15 గుంటల పొలం ఉంది. కాని అతనికి కేవలం రూ. 750లు మాత్రమే పడ్డాయి. వాస్తవానికి అతనికి రూ. 8,250 జమ కావాలి కాని అలా జమకాలేదు. మరో రైతుకు 3 ఎకరాల పొలం ఉంటే కేవలం రూ.500 మాత్రమే పడ్డాయి. ఇలా పలువురి రైతులకు భూ విస్తీర్ణం ఎక్కువ ఉంటే తక్కువ డబ్బులు పడుతున్నాయని, మరి కొంరికి తక్కువ భూమి ఉన్నా అసలు డబ్బులే పడలేవు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా సక్రమంగా పడ్డాయని, ప్రస్తుతం ఇలా ఎందుకు జరుగుతుందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరికి సబ్‌మీటెడ్ ఇన్ బిల్స్‌అని డీబీటీ స్టేటస్‌లో చూపిస్తుందని వారు విచారం వ్యక్తం చేశారు. తమకు రైతు భరో సా డబ్బులు ఇప్పించాలని వ్యవసాయ విస్తరణ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఆర్‌ఓఆర్, 1బి రికార్డుల్లో భూముల విస్తీర్ణం, ధరణిలో వ్యత్యాసం ఉంటే వాస్తవ విస్తీర్ణం ప్రకారం డబ్బులు జమ అయినట్లు తెలుస్తుందని ఏఈఓలు చెబుతున్నారు. రైతుల డీబీటీస్టేటస్‌లో టుబీ ప్రాసెస్, సబ్‌మిటెడ్ బిల్స్ అని ఉన్న రైతులకు డబ్బులు జమ అయ్యే అవకాశం ఉందని, మిగిలిన రైతు లు రెవెన్యూ అధికారులను సంప్రదించాలని వారు సూచిస్తున్నారు.

కల్వకుర్తి అభివృద్ధే లక్ష్యం


వెల్జాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

- రూ.250 కోట్లతో బీటీరోడ్లు
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో రూ.250 కోట్లతో బీటీరోడ్ల నిర్మాణం చేపట్టామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. విపక్షాలు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా అభివృద్ధిపైనే తమ దృష్టి అని పేర్కొన్నారు. తలకొండపల్లి మండల పరిధి గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. మండల కేంద్రంలో రూ.15 లక్షలతో సీసీరోడ్లు, మురుగు కాల్వలు, అంతారంలో రూ.15 లక్షలతో సీసీరోడ్లు, వెంకటాపూర్‌లో రూ.25 లక్షలతో సీసీరోడ్లు, మురుగు కాల్వలు, వెల్జాలలో రూ.20 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీరోడ్ల నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. విద్య, వైద్యం, రవాణా అభివృద్ధికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని, ప్రజాపాలన చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు సర్కార్‌పై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో ఆయా పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పనున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర నాయకుడు మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అంజయ్య, అజీం, వెంకట్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, నర్సింహ, రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.